నేడు ఉచిత వైద్య శిబిరం

జగద్గిరిగుట్ట: చింతల్‌, పద్మా నగర్‌ కాలనీ ఫేజ్‌ 1లోని వెల్ఫేర్‌ సొసైటీ కార్యాలయం వద్ద శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు అసోసియేషన్‌ సభ్యులు శుక్రవారం తెలిపారు. అపోలో డయాగ్నొస్టిక్స్‌ ఆధ్వర్యంలో ఉదయం 7 నుంచి 11 గంటల వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. వైద్య శిబిరాన్ని కాలనీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో ఆర్థిక భరోసా



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్‌

కుత్బుల్లాపూర్‌: ఆపదలో ఉన్న నిరు పేదలకు ఆర్థిక, ఆరోగ్య భరోసానిచ్చేది సీఎం రిలీఫ్‌ ఫండ్‌ అని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ అన్నారు. గాజులరామారం డివిజన్‌ ఇందిరా నగర్‌కు చెందిన ముత్తు స్వామికి రూ. 2 లక్షల ఎల్‌ఓసీ మంజూరైంది. శుక్రవారం పేట్‌ బషీరాబాద్‌లోని క్యాంప్‌ కార్యాలయంలో లబ్ధిదారుడికి ఎల్‌ఓసీని అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ జగద్గిరిగుట్ట డివిజన్‌ అధ్యక్షుడు రుద్ర అశోక్‌, కుత్బుల్లాపూర్‌ డివిజన్‌ ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, నాయకులు ఎర్వ సాయికిరణ్‌, ఇమ్రాన్‌ బేగ్‌ తదితరులు పాల్గొన్నారు.

గణపతి సచ్చిదానంద ఆశ్రమానికి ప్రత్యేక బస్సులు

జీడిమెట్ల: మార్చి 29 నుంచి ఏప్రిల్‌ 7వరకు సికింద్రాబాద్‌ నుంచి దుండిగల్‌లోని గణపతి సచ్చిదానంద స్వామి ఆశ్రమానికి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు జీడిమెట్ల డీఎం అంజనేయులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇట్టి అవకాశాన్ని ఆశ్రమానికి వెళ్లే భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలి



బస్సు డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ నాగరాజు

దుండిగల్‌: ఆర్టీసీ డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్‌ నిబంధనలను పాటించాలని అల్వాల్‌ ట్రాఫిక్‌ సీఐ ఏ.నాగరాజు అన్నారు. నూతనంగా ఎంపికైన 102 ఆర్టీసీ డ్రైవర్లకు శుక్రవారం హకీంపేటలోని బస్‌ డిపోలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెల్‌ఫోన్‌ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలను నడపవద్దని సూచించారు. బస్‌బేల వద్దనే బస్సులను ఆపాలని, జీబ్రా క్రాసింగ్‌ వద్ద ఆపి పాదాచారులకు ఇబ్బంది కలిగించవద్దన్నారు. ఇటీవల కాలంలో జరిగిన రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్‌ ఉల్లంఘనలపై రూపొందించిన వీడియోలను ప్రదర్శించారు.

బస్సు ఢీకొని మహిళ మృతి



సుజాత (ఫైల్‌)

కుత్బుల్లాపూర్‌: నడుచుకుంటూ వెళ్తున్న మహిళను బస్సు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన పేట్‌ బషీరాబాద్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. కొంపల్లి సాయిబాబానగర్‌ కాలనీకి చెందిన ధశరథ్‌రెడ్డి, బాదం సుజాత(50) భార్యాభర్తలు. శుక్రవారం సొంత గ్రామం నుంచి కొంపల్లికి బస్సులో వచ్చింది. బస్సు దిగిన సుజాత మధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతంలో ఇంటికి నడుచుకుంటూ వెళ్తుంది. ఈ క్రమంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన టీజీ 08టీ 7616 బస్సు ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. బస్సు డ్రైవర్‌ వాహనాన్ని వదిలేసి పరారయ్యాడు. మృతురాలికి ఇద్దరు ఆడ పిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్‌ షాపులకు సన్న బియ్యం

పేదలకు పంపిణీ చేసేందుకు యంత్రాంగం సన్నాహాలు

- ఉగాది కానుకగా.. ఏప్రిల్‌ నుంచి రేషన్‌ షాపుల ద్వారా పంపిణీ
- రేషన్‌ బియ్యం అక్రమ రవాణా అడ్డకట్టకు చర్యలు
- గోదాముల నుంచి రేషన్‌ దుకాణాలకు తరలింపునకు కసరత్తు
- 5.23 లక్షల ఆహార భద్రతా కార్డుదారులకు 10,640 మెట్రిక్‌ టన్నుల సన్నబియ్యం



సాక్షి, సిటీబ్యూరో: పేదలకు సన్న బియ్యం పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఉగాది రోజున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ పథకానికి శ్రీకారం చుట్టనున్నారు. ఏప్రిల్‌ 1వ తేదీ నుంచి ఆహార భద్రత కార్డు ఉన్న వారికి రేషన్‌ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయనున్నారు. మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాకు సంబంధించి పక్క జిల్లాల్లోని మండలస్థాయి గోదాముల నుంచి ప్రత్యేక వాహనాల ద్వారా రేషన్‌ దుకాణాల్లోకి చేరవేసే ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లాలోని అర్బన్‌ ప్రాంతాలకు ప్రతినెలా రేషన్‌ పంపిణీ ఆలస్యం అవుతోంది. అన్నిచోట్లా నెల ప్రారంభం నుంచి సరకులు ఇస్తుండగా.. కొన్ని పురపాలక సంఘాల్లో మాత్రం రెండో వారం ప్రారంభిస్తున్నారు. ఈ సారి కూడా ఆలస్యం చేస్తారా.. అనుకున్న సమయానికి పంపిణీ చేస్తారా? అనేది చూడాల్సి ఉంది. రేషన్‌ కార్డులో ప్రతి సభ్యుడికి ఉచితంగా ఆరు కిలోలు అందజేస్తారు.

ఎన్నికల హామీ మేరకు..

బయటి మార్కెట్లో సన్న బియ్యం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. సామాన్యులు, మధ్యతరగతి ప్రజలు కొనలేని పరిస్థితి. ఇది వరకు రేషన్‌ దుకాణాల్లో ఇచ్చే దొడ్డు బియ్యం అమ్మేసి ఆ డబ్బులతో సన్న బియ్యం కొనుగోలు చేసే వారు. దీంతో రేషన్‌ బియ్యం పక్కదారి పట్టేది తాము అధికారంలోకి వస్తే సన్న బియ్యం ఇస్తామని కాంగ్రెస్‌ పార్టీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. ఏడాది దాటిన తర్వాత సన్న బియ్యం పథకం అమలుకు కాంగ్రెస్‌ ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. ఈ ప్రక్రియతో అక్రమాలకు చెక్‌ పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

ప్రజాసంక్షేమమే ధ్యేయంగా..

ప్రజాసంక్షేమమే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అర్హులకు సంక్షేమ పథకాలను అందిస్తున్నాయి. అందులో భాగంగా పేద, మధ్య తరగతి ప్రజలకు నిత్యావసరాలు అందించేందుకు రేషన్‌ దుకాణాలను ఏర్పాటు చేశారు. ప్రతి నెలా లబ్ధిదారులకు ఉచితంగా బియ్యం అందిస్తున్నారు. దొడ్డు రకం బియ్యం తీసుకునేందుకు చాలా మంది ఆసక్తి చూపకపోవడం, ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని సన్నబియ్యం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

అక్రమాలకు అడ్డుకట్ట

మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో చాలా కుటుంబాలు సన్నబియ్యం వినియోగిస్తుండటంతో.. దొడ్డు బియ్యం అక్రమార్కులకు వరంలా మారుతోంది. లబ్ధిదారుల నుంచి కిలోకు రూ.10 నుంచి రూ.15 చొప్పున కొనుగోలు చేస్తూ.. రూ.లక్షల్లో అక్రమ దందా సాగిస్తున్నారు. అధికారులే కొన్ని చోట్ల అక్రమార్కులకు సహకరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తుండగా, పలువురు రేషన్‌ షాపు డీలర్లు కూడా వంతపాడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రేషన్‌ బియ్యాన్ని రిసైక్లింగ్‌ చేసి తిరిగి విక్రయిస్తున్నారనే ఆరోపణలు సైతం ఉన్నాయి. ప్రభుత్వం ఈ అక్రమ దందాను నిలువరించేందుకే రేషన్‌ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ చేస్తోంది.

5.23 లక్షల మందికి కార్డులు

మేడ్చల్‌ జిల్లాలోని 619 రేషన్‌ దుకాణాల ద్వారా 5,23,938 రేషన్‌ కార్డు దారులకు ప్రతినెలా ఉచితంగా ఒకరికి 6 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఇందులో 17,18,351 మంది లబ్ధిదారులు(యూనిట్లు) ఉండగా, ఒకరికి 6 కిలోల చొప్పున 10640.052 మెట్రిక్‌ టన్నుల బియ్యం అందజేస్తున్నారు. ఉగాది కానుకగా.. ఏప్రిల్‌ నుంచి రేషన్‌ దుకాణాల ద్వారా లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీకి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సన్నబియ్యం అందించేందుకు సంబంధిత ఏర్పాట్లు చేస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

నేడు విద్యుత్‌ సరఫరాకు అంతరాయం

కుత్బుల్లాపూర్‌: సమ్మర్‌ యాక్షన్‌ ప్లాన్‌లో భాగంగా పలు విద్యుత్‌ ఫీడర్ల నిర్వహణ నేపథ్యంలో శనివారం సరఫరాలో అంతరాయం కలుగనుందని పేట్‌బషీరాబాద్‌ ఏఈ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ మీనాక్షి ఫీడర్‌ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి 3 గంటల వరకు మీనాక్షి ఎన్‌క్లేవ్‌, స్ప్రింగ్‌ ఫీల్డ్‌ కాలనీ, అంగడిపేట్‌, 11కేవీ గాయత్రినగర్‌ ఫీడర్‌ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి 3.30 గంటల వరకు గాయత్రినగర్‌, గోదావరి హోమ్స్‌, 11కేవీ జీబీఆర్‌ క్లబ్‌ ఫీడర్‌ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి 3.45 గంటల వరకు పేట్‌బషీరాబాద్‌ ప్రధాన రోడ్డు, రాయల్‌టక్‌, బాంటియా ఫర్నీచర్‌, జుడియో, సత్తిరెడ్డి కాంప్లెక్స్‌, 11కేవీ సన్మాన్‌ బల్మోర్‌ ఫీడర్‌ పరిధిలో ఉడ్స్‌ కాలనీ, వైష్ణవి మిడోస్‌, సన్మాన్‌ విల్లాస్‌, యాదిరెడ్డి బండ, సయ్యద్‌నగర్‌, 11కేవీ సెయింట్‌ ఆన్స్‌ ఫీడర్‌ పరిధిలో సెయింట్‌ ఆన్స్‌ స్కూల్‌, పేట్‌ బషీరాబాద్‌ పోలీస్‌స్టేషన్‌, రెనోవా ఆసుపత్రి, ఎస్‌సీఎల్‌ కాలనీ, 11కేవీ వైష్ణవి ఫీడర్‌ పరిధిలో వైష్ణవి ఎన్‌క్లేవ్‌, వనమాస్‌ క్లేర్‌, కల్యాణ్‌ కన్‌స్ట్రక్షన్స్‌, హర్ష ఆసుపత్రి, నారాయణ స్కూల్‌, డీమార్ట్‌ వెనుక గల్లీ, 11కేవీ ఫెయిర్‌మౌంట్‌ ఫీడర్‌ పరిధిలో ఫెయిర్‌మౌంట్‌ కమర్షియల్‌ కాంప్లెక్స్‌ ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

కొంపల్లి సెక్షన్‌ పరిధిలో..

కుత్బుల్లాపూర్‌: విద్యుత్‌ ఫీడర్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు సందర్భంగా విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని కొంపల్లి సెక్షన్‌ ఏఈ శ్రీనివాస్‌ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ ధోలారీధనీ ఫీడర్‌ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి 3 గంటల వరకు పోచమ్మగడ్డ, సాయి కృపా అపార్ట్‌మెంట్స్‌, వెంకటరెడ్డి గోదాములు, శ్రీకాంత్‌రెడ్డి గోదాములు, ధోలారీధనీ రోడ్డు బ్రిడ్జి, 11కేవీ గంగాస్థాన్‌ ఫీడర్‌ పరిధిలో సాయంత్రం 4 నుంచి 4.30 గంటల వరకు గంగాస్థాన్‌, 11కేవీ దూలపల్లి ఫీడర్‌ పరిధిలో మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆదిత్య ఉడ్స్‌, చౌదరి కాంటా, మజీద్‌ రోడ్డు, దేవీ హోటల్‌ వెనుక గల్లీ, 11కేవీ పేట్‌బషీరాబాద్‌, జీబీవీఆర్‌ ఫీడర్ల పరిధిలో రిలయెన్స్‌ పెట్రోల్‌ బంక్‌, టోబాకో కంపెనీ ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఏఈ పేర్కొన్నారు.

సీనియర్‌ సిటిజన్స్‌ సేవలు అభినందనీయం

కుత్బుల్లాపూర్‌: సీనియర్‌ సిటిజన్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే వివేకానంద్‌ అన్నారు. కుత్బుల్లాపూర్‌ సీనియర్‌ సిటిజన్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ నూతన కార్యవర్గ సభ్యులు శుక్రవారం పేట్‌బషీరాబాద్‌ క్యాంప్‌ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీనియర్‌ సిటిజన్స్‌ ఆధ్వర్యంలో చేపట్టే ఎలాంటి కార్యక్రమానికైనా తన వంతు పూర్తి సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్‌ అధ్యక్షుడు నరసింహారెడ్డి, సలహాదారుడు బలవంతరెడ్డి, ప్రధాన కార్యదర్శి పెద్ది మల్లేశం, కోశాధికారి మురళీగౌడ్‌, ఉపాధ్యక్షులు లింగం గౌడ్‌, నాగేష్‌ కుర్మ, ఆర్గనైజింగ్‌ సెక్రటరీ లక్ష్మణాచారి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు శాంపిళ్ల సేకరణ



నీళ్ల శాంపిళ్లను పరీక్షిస్తున్న డీజీఎం వికాస్‌, మేనేజర్‌ పూజిత

చింతల్‌: ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించేందుకు కృషి చేస్తున్నామని జలమండలి డీజీఎం వికాస్‌ అన్నారు. శుక్రవారం ఆదర్శ్‌నగర్‌ సెక్షన్‌ పరిధిలోని పలు ఇళ్లల్లో నీటి శాంపిళ్లను మేనేజర్‌ పూజితతో కలిసి సేకరించి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలోని చాలా చోట్ల తాగునీటిలో డ్రైనేజీ లైన్లు కలవడంతో ప్రజలు అనారోగ్యం పాలైన ఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. వాటిని దృష్టిలో ఉంచుకుని ఆదర్శ్‌నగర్‌ సెక్షన్‌ పరిధిలో ఇంటింటి సర్వేతో పాటు నీటి శాంపిళ్లను సేకరిస్తున్నామని తెలిపారు. ఈ శాంపిళ్ల సేకరణలో స్థానిక లైన్‌మెన్లు పాల్గొన్నారు.

ఎంఎల్‌ఆర్‌ఐటీఎంలో టెక్నికల్‌ ఫెస్ట్‌



కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల చైర్మన్‌ మర్రి లక్ష్మణ్‌రెడ్డి తదితరులు

దుండిగల్‌: మర్రి లక్ష్మణ్‌ రెడ్డి ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ అండ్‌ మేనేజ్‌మెంట్‌, ఫార్మసీ కళాశాలల్లో శుక్రవారం టెక్నికల్‌ ఫెస్ట్‌ను ఘనంగా నిర్వహించారు. సాంకేతిక అభివృద్ధి భాగంగా నేషనల్‌ లెవెల్‌ టెక్నికల్‌ ఫెస్ట్‌ వలారస్‌ 2కె25 ఈవెంట్‌ జరిగింది. వివిధ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. రోబోటిక్స్‌, కోడింగ్‌ అండ్‌ డీబగ్గింగ్‌, బిల్డింగ్‌ ఆర్కిటెక్చర్‌, బిజినెస్‌ ఈ సమ్మిట్‌, పేపర్‌ ప్రజెంటేషన్‌, వెల్డింగ్‌, బ్యాటరీ వెహికల్స్‌, ప్రధానంగా ఆర్టిఫీషియల్‌ ఇంటెలిజెన్స్‌ మీద భవిష్యత్‌లో కలిగే ఉపయోగాల గురించి వివరించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్‌ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, డైరెక్టర్‌ పి.శ్రీధర్‌ మాట్లాడుతూ.. ఇంజినీరింగ్‌ కళాశాలల విద్యార్థుల వినూత్న ఆలోచనలు, వారి ప్రతిభను ప్రదర్శించడానికి అవకాశం కల్పించడానికి టాప్‌ క్లాస్‌ ఈవెంట్‌లు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ డా. మురళి ప్రసాద్‌, ఫార్మసీ ప్రిన్సిపాల్‌ డా. అర్జబ్‌ మాలిక్‌ , డా.అమర్‌నాథ్‌, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి : సీపీఎం



డీజీఎంకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

సుభాష్‌నగర్‌: సూరారం డివిజన్‌లో నెలకొన్న తాగునీటి ఎద్దడిని నివారించాలని సీపీఎం మండల కార్యదర్శి లక్ష్మణ్‌ డిమాండ్‌ చేశారు. శుక్రవారం జలమండలి డీజీఎం రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షాపూర్‌నగర్‌, సంజయ్‌గాంధీనగర్‌, కళావతినగర్‌, న్యూ షాపూర్‌నగర్‌ బస్తీలలో తీవ్ర మంచినీటి సమస్య నెలకొందన్నారు. ఈ నెల 7 నుంచి 20 వరకు సీపీఎం ఆధ్వర్యంలో ఇంటింటి సర్వేలో ఆయా బస్తీల ప్రజలు నీటి ఎద్దడిని వివరించారని గుర్తు చేశారు. జలమండలి ఆధ్వర్యంలో సరఫరా చేస్తున్న నీరు సరిపోవడం లేదన్నారు. నీటి సరఫరా సమయం పెంచాలని కోరారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు పసుల అంజయ్య, రావుల స్వాతి, మల్లారెడ్డి, యాదవరెడ్డి, శీను, సత్యనారాయణ, రమేష్‌ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్‌ ధరించండి.. సురక్షితంగా ప్రయాణించండి

బాలానగర్‌ ట్రాఫిక్‌ ఎస్‌ఐ భాను ప్రసాద్‌



హెల్మెట్‌ అందజేస్తున్న ట్రాఫిక్‌ ఎస్‌ఐ భానుప్రసాద్‌

రంగారెడ్డినగర్‌: వాహనదారులు ట్రాఫిక్‌ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని బాలానగర్‌ ట్రాఫిక్‌ ఎస్‌ఐ భాను ప్రసాద్‌ అన్నారు. శుక్రవారం బాలానగర్‌ ట్రాఫిక్‌ పోలీసుల ఆధ్వర్యంలో జూడో స్టూడియో ఉద్యోగుల సహకారంతో ఐడీపీఎల్‌ కాలనీ ఎదురుగా ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెల్మెట్‌ ధరించని పలువురు వాహనదారులను గుర్తించి వారికి ఉచితంగా హెల్మెట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. చాలా వరకు రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్‌ ధరించకపోవడంతోనే ప్రాణ నష్టం వాటిల్లుతోందని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ ధరించాలన్నారు. త్రిబుల్‌ డ్రైవింగ్‌, రాంగ్‌రూట్‌, మొబైల్‌ మాట్లాడుతూ వాహనాలు నడపరాదని, డ్రైవింగ్‌ లైసెన్స్‌లు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. ఇటీవల మైనర్లు ద్విచక్ర వాహనాలు నడుపుతూ పట్టుబడుతున్నారని, వారికి వాహనాలు ఇస్తున్న తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అదే విధంగా ట్రాఫిక్‌ పోలీసుల ఆధ్వర్యంలో వాహనదారులకు నీళ్ల బాటిళ్లు, చాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్‌ హెడ్‌ కానిస్టేబుల్‌ వెంకటేష్‌గౌడ్‌, కానిస్టేబుళ్లు ఉమామహేశ్వరరావు, ఆంజనేయులు, వీరేష్‌, హోమ్‌గార్డు సుధాకర్‌, ట్రాఫిక్‌ వాలంటీర్లు రాజేందర్‌, జగదీశ్వర్‌, జూడో సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

రొమ్ము కేన్సర్‌పై ఉచిత శిబిరం

కుత్బుల్లాపూర్‌: కొంపల్లి ఎన్‌సీఎల్‌ నార్త్‌ కాలనీలో గ్రాన్యుల్స్‌ ఇండియా, ఏఐజీ ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం మహిళలకు ఉచితంగా బ్రెస్ట్‌ కేన్సర్‌ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు చిగురుపాటి ప్రజ్ఞ మాట్లాడుతూ.. 35 సంవత్సరాలు దాటిన మహిళలు ప్రతి సంవత్సరం బెస్ట్‌ కేన్సర్‌ పరీక్షలు చేయించుకోవాలన్నారు. మహిళా మోర్చా నాయకురాలు పాతూరి మాధురి మాట్లాడుతూ.. గ్రాన్యూల్స్‌, ఏఐజీ ఆసుపత్రి చేస్తున్న సామాజిక కార్యక్రమాలలో భాగంగా ఉచిత రొమ్ము కేన్సర్‌ పరీక్షలు పేదవారికి ఎంతో మేలు చేస్తుందన్నారు. శిబిరంలో ఉమామహేశ్వర కాలనీ, ఎన్‌సీఎల్‌ నార్త్‌ కాలనీ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



శిబిరానికి హాజరైన మహిళలు

‘సాక్షి’ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణానికి ఏర్పాట్లు

నిజాంపేట్‌ : తెలుగు వారి నూతన ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రముఖ మీడియా సంస్థ ‘సాక్షి’ ఆధ్వర్యంలో మార్చి 30న బాచుపల్లి, క్రాంతి నగర్‌ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్న పంచాంగ శ్రవణానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. పంచాంగ శ్రవణానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా శుక్రవారం ముందస్తు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రముఖ సంస్థ భారతీ సిమెంట్స్‌ ఈ కార్యక్రమానికి స్పాన్సర్‌గా వ్యవహరిస్తోంది. సిద్ధాంతి చక్రవర్తుల శ్రీవత్సాచార్యులచే పంచాంగ శ్రవణం, ఆధ్యాత్మిక ప్రసంగాలు, ప్రఖ్యాత నర్తకి యామిని రెడ్డి బృందం కళాత్మక కూచిపూడి నృత్యం, అన్నదాన కార్యక్రమం ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు. ప్రజలు అందరూ ఈ ఉగాది పంచాంగ శ్రవణానికి హాజరవ్వాలని కోరారు.

మహనీయుల ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్‌ హన్మంత్‌రెడ్డి



సన్నాహక సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్‌ పార్టీ శ్రేణులు

నిజాంపేట్‌ : ప్రజాస్వామ్య పరిరక్షణకు మహాత్మా గాంధీ, అంబేద్కర్‌ వంటి మహనీయుల ఆలోచనా విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్‌ హన్మంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జై బాపు, జై భీమ్‌, జై సంవిధాన్‌ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యక్రమంలో ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, అధ్యక్షులు కొలన్‌ రాజశేఖర్‌రెడ్డి, సీనియర్‌ నాయకులు గోపాల్‌రెడ్డి, ప్రజా ప్రతినిధులు, మహిళలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దుండిగల్‌: దుండిగల్‌ మున్సిపాలిటీలో కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు నవీన్‌రెడ్డి అధ్యక్షతన నియోజకవర్గ కో ఆర్డినేటర్‌ ఉజ్మా శాకిర్‌ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్‌ హన్మంత్‌ రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ బొంగునూరి శ్రీనివాస్‌ రెడ్డి, మాజీ జడ్పీ వైస్‌ చైర్మన్‌ బొంగునూరి ప్రభాకర్‌ రెడ్డి, కిసాన్‌ సెల్‌ జిల్లా అధ్యక్షుడు సదానందం, కాంగ్రెస్‌ నాయకులు బొంగునూరి కిశోర్‌ రెడ్డి, రాము గౌడ్‌, మైసిగారి శ్రీనివాస్‌, కావలి గణేశ్‌, యాదయ్య, మల్లేశ్‌, నరసింహ, చింతకింది సురేశ్‌, కుమార్‌ యాదవ్‌, అక్బర్‌, జక్కుల మల్లేశ్‌, ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్‌ డే వేడుకలు



విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న డాక్టర్‌ నంద కుమార్‌రెడ్డి

నిజాంపేట్‌ : మమతా అకాడమీ ఆఫ్‌ మెడికల్‌ సైన్సెస్‌ అండ్‌ హాస్పిటల్‌ మొదటి బ్యాచ్‌ (2019) గ్రాడ్యుయేషన్‌ డేను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కేఎన్‌ఆర్‌ విశ్వవిద్యాలయ వీసీ డాక్టర్‌ నంద కుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వైద్య విద్యార్థులు తమ వృత్తిలో ఎలా రాణించాలో వివరించారు. సుమారు 133 మంది మెడికల్‌ గ్రాడ్యుయేట్స్‌ పట్టాలు అందుకున్నారు. కార్యక్రమంలో మమతా ఎడ్యుకేషనల్‌ సొసైటీ చైర్మన్‌ పువ్వాడ అజయ్‌ కుమార్‌, మేనేజింగ్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ పువ్వాడ నయన్‌రాజ్‌, డీన్‌ డాక్టర్‌ పి.హరికృష్ణ, మెడికల్‌ సూపరింటెండెంట్‌ డాక్టర్‌ సురేష్‌ కుమార్‌ పటేల్‌, డిప్యూటీ మెడికల్‌ సూపరింటెండెంట్‌ డాక్టర్‌ ఈ.ప్రణీత్‌కుమార్‌, కళాశాల వైస్‌ ప్రిన్సిపల్స్‌ డాక్టర్‌ బి.నవీన్‌కుమార్‌, డాక్టర్‌ పోకల నవీన్‌, నర్సింగ్‌ కళాశాల ప్రిన్సిపల్‌ డాక్టర్‌ షంషాద్‌ బేగం, నర్సింగ్‌ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో మహిళ హత్య

- ఘటనకు ముందే మద్యం తాగిన మహిళ, నిందితుడు
- వివరాలు వెల్లడించిన డీసీపీ సురేష్‌కుమార్‌

జీడిమెట్ల: డబ్బు ఆశ చూపి తీసుకొచ్చాడు.. ఆమెతో గడిపాడు.. అనంతరం మద్యం మత్తులో రాక్షసుడిలా మారి ఆమెపై పిడిగుద్దులు గుద్ది అంతమొందించాడు. సమాచారం అందుకున్న పోలీసులు నిందితుడిని సనత్‌నగర్‌ పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు శుక్రవారం బాలానగర్‌ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీసీపీ కె.సురేష్‌కుమార్‌, అడిషనల్‌ డీసీపీ సత్యనారాయణ, ఏసీపీ హన్మంతరావు, సనత్‌నగర్‌ ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాసులుతో కలిసి వివరాలు వెల్లడించారు. జనగామ జిల్లా బచ్చన్నపేటకు చెందిన కొమ్మరాజు కనకరాజు(34) ఏడు సంవత్సరాల క్రితం బతుకుదెరువు కోసం నగరానికి వచ్చాడు. నాటి నుంచి చిన్న చిన్న పనులు చేస్తూ జీవిస్తున్నాడు. అనంతరం దొంగతనాలకు అలవాటు పడ్డాడు. ఈ నెల 26న సాయంత్రం 6గంటలకు ఎర్రగడ్డలో కనకరాజు మద్యం తాగి లైంగిక వాంఛ తీర్చుకునేందుకు అక్కడే ఉన్న ఓ మహిళ(56)తో ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఇద్దరు కలిసి అక్కడే మద్యం తాగారు. అనంతరం మహిళను రోడ్డుపక్కన ఓ నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో ఆమెపై దాడికి పాల్పడ్డాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం కనకరాజు అక్కడ నుంచి వెళ్లిపోయాడు. సుమారు రాత్రి 11 గంటల సమయంలో అటుగా వెళ్తున్న షేక్‌ నయీం మృతదేహాన్ని గమనించి 100కు సమాచారం అందించాడు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న సనత్‌నగర్‌ పోలీసులు ఆధారాలు సేకరించారు. ఈ మేరకు నిందితుడు కనకరాజును శుక్రవారం బాలానగర్‌లో అదుపులోకి తీసుకున్నారు. విచారణలో తాను హత్య చేసినట్లు అంగీకరించాడు. దీంతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాసులు, ఎస్‌ఐ బి.రాధాకృష్ణ, హెడ్‌ కానిస్టేబుల్‌ డి.శ్రీనివాసులు, కానిస్టేబుల్‌ బాలకృష్ణలకు రివార్డులు అందజేశారు.

నల్ల చెరువు అభివృద్ధి పనులు చేపట్టాలని వినతి

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని నల్ల చెరువు అభివృద్ధి పనులు చేపట్టాలని కార్పొరేటర్‌ జూపల్లి సత్యనారాయణ హైడ్రా కమిషనర్‌ రంగనాథ్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. ఇటీవల కూకట్‌పల్లి నల్ల చెరువు నుంచి నీటిని తొలగించారని, దీంతో చుట్టుపక్కల కాలనీల్లో భూగర్భ జలాలు తగ్గాయని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అదే విధంగా బతుకమ్మ కుంట అభివృద్ధి ప్రతిపాదనకే పరిమితమైందని, ఇప్పటి వరకు ఎటువంటి పురోగతి లేదన్నారు. త్వరితగతిన అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు.

ప్రజలు భాగస్వాములవ్వాలి



మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

సుభాష్‌నగర్‌: మానవ అక్రమ రవాణాను అరికట్టడంతో ప్రజలు భాగస్వాములవ్వాలని ప్రజ్వల ప్రాజెక్ట్‌ సీనియర్‌ మేనేజర్‌ బలరామకృష్ణ అన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ కుత్బుల్లాపూర్‌ ప్రాజెక్ట్‌ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణాపై శుక్రవారం సూరారం లూయిస్‌ బ్రెయిలీ భవనంలో రెండవ రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో ఏదో ఒక చోట మహిళలు, బాలికలు మానవ అక్రమ రవాణాకు గురవుతున్నారని, ఎంతో మంది జీవితాలను నాశనం చేస్తున్న నేరపూరితమైన ఈ చర్యను ఆదిలోనే అడ్డుకుంటే మన ఆడపిల్లలను రక్షించుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ దీనిపై అవగాహన పెంచుకొని అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి అంగన్‌వాడీ టీచర్‌ తమ పరిధిలోని మహిళలకు, అమ్మాయిలకు అక్రమ రవాణాపై అవగాహన కల్పించాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్లతో మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ప్లకార్డులను ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజ్వల సంస్థ కో ఆర్డినేటర్‌ సురేష్‌ కుమార్‌, అంబర్‌ సింగ్‌, మిథాలీ రాజ్‌, అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు సుజాత, శ్రీదేవి, సుబ్బలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్స్‌ పాల్గొన్నారు.